

ఐక్యతకు ప్రతీక.. దర్గా

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

మదనపల్లె సిటీ: ఐక్యతకు ప్రతీకగా నిలిచే హజ్రత్ ఖాదర్ షా ఔలియా దర్గా ఉరుసు మహోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం గంధం, 23వతేదీ శనివారం ఉరుసు, అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం, 24వతేదీ ఆదివారం సాయంత్రం తహలీల్ ఫాతేహా, ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఉరుసు ఉత్సవాలకు ప్రత్యేకత ముషాయిరా...

ఉత్సవాలలో భాగంగా ఏటా నిర్వహించే అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈసారి 25వ అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం జరుగుతుంది. ఇందులో దేశ నలుమూలల నుంచి హిందూ, ముస్లిం కవులు పాల్గొననున్నట్లు ముషాయిరా కార్యదర్శి ఖమర్‌అమీని, కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు.

ఏకతకు చిహ్నం.. వన భోజనం



కార్తిక వన భోజనాలతో ఊరూ వాడా సందడిగా మారాయి. తమలోని ఐక్యతకు.. ఐకమత్యానికి ఇవి ప్రతీకగా నిలుస్తున్నాయి. కార్తిక మాసం అంటే చాలు.. శివయ్యకు పూజలతో పాటు వన భోజనాలూ గుర్తుకొస్తాయి. ఆయా కులాలు, వర్గాల వారందరూ ఒకే చోట చేరి ఉమ్మడిగా కలిసి వన భోజనాలు చేస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నాపెద్దా తేడా లేకుండా ఆహ్లాదంగా గడుపుతారు. దీని ద్వారా వారిలో ఐకమత్యం పెరగడంతో పాటు సోదరభావం పెరుగుతుంది. దీంతో పాటు చిన్నా చితకా కోపతాపాలున్నా.. మదిలో కల్మషాలు ఉన్నా తొలిగిపోతాయి. ఇక సకల జీవకోటికి ప్రాణాధారమైన భూమాతను ఆరాధించుట సంప్రదాయం. ఇందులో భాగంగా వన భోజనాల సమయంలో ధాత్రి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వన భోజనాలు జరగ్గా.. రాబోయే రోజుల్లో మరికొంతమంది వన భోజనాలకు సిద్ధమవుతున్నారు. –మదనపల్లె సిటీ

క్లుప్తంగా

24న కార్తిక వన భోజనం

మదనపల్లె సిటీ: బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శంకర బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు కోదండరామయ్య తెలిపారు. ఇందులో భాగంగా ధాత్రి పూజ, భగవద్గీత పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం వనభోజన కార్యక్రమం జరుగుతుందన్నారు. బ్రాహ్మణులు పాల్గొనాలని కోరారు.

నిర్లక్ష్యంగా పని చేస్తే చర్యలు

పెద్దతిప్పసముద్రం: సచివాలయ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని నిర్లక్ష్యంగా పని చేస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) అమరనాథ్‌రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. గురువారం వారు మండలంలోని వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతి కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌పీసీఐ లింక్, గృహాల జియోట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. మండలంలోని పట్టెంవాండ్లపల్లి, టి సదుం, తుమ్మరకుంట పంచాయతిల్లో సర్వే విధానం చాలా వెనుకబడి ఉందని సదరు సిబ్బంది పని తీరు మెరగు పరచుకోవాలని సూచించారు.

ముళ్ల పొదల తొలగింపు

కలికిరి: మండల కేంద్రం కలికిరి సమీపంలో చక్కెరవాండ్లపల్లి నుంచి కదిరాయచెరువుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు భోగేష్ స్పందించి తన సొంత నిధులు వెచ్చించి జేసీబీ సాయంలో ముళ్ల పొదలను తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హజ్‌యాత్రపై వివాదాస్పద వ్యాఖ్యలు దారుణం

పీలేరు: హజ్‌యాత్రపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వివాదస్పద వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని ఏపీ టూరిజం కౌన్సిల్ మెంబర్ ఎస్. షాకీర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా వంద ఎలుకలను తిన్న పిల్లి హజ్ యాత్రకు పోయిందా అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్నారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను తిరిగి వెనక్కి తీసుకోవాలన్నారు. మైనారిటీ నాయకులు మునీర్, అబీద్, దావూద్, రియాజ్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం హౌసింగ్ ఈఈ వెంకటదాస్, డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి, డీఈ వెంకటరెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కొత్తగా పక్కా గృహాల మంజూరుకు అర్హులైన లబ్ధిదారుల నుంచి సమగ్రమైన ఆధారాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే గృహాలు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడి అసంపూర్తిగా నిలిపేసిన పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జేఈ శ్రీనివాసులు, ఏపీఎం హరి, ఈవోఆర్డీ యోగానంద్‌లు పాల్గొన్నారు.

కార్గో సేవలను విస్తృతం చేస్తాం

పీలేరురూరల్: ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తృతం చేస్తామని కార్గో అధికారి సి.జనార్దన్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు కార్గో సెంటర్‌లో నిర్దేశించుకున్న లక్ష్యంలో 48 శాతం మాత్రమే ఆదాయం వస్తోందని, ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా కేవీపల్లె, వగళ్లలో కార్గో సెంటర్ నిర్వహణకు ఆసక్తి వున్న వారు స్థానిక డిపో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలపై వినతి

పీలేరు రూరల్: పీలేరు పట్టణంలో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న ఆకతాయుల ఆగడాలను అరికట్టాలని దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాష్ గురువారం ఎస్‌ఐ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఆకతాయిలు కళాశాలల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థినుల వెంటపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాలలు, కళాశాలలు ఓపెనింగ్ టైం, వదిలిపెట్టే సమయంలో పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.

రూల్స్ ఇసుకలో తొక్కేశారు

ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నిబంధనలు గాలికొదిలి.. ప్రజా భద్రతను ఇసుకలో తొక్కిపెట్టి చెలరేగిపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా.. దౌర్జన్యమే ఆయుధంగా చేసుకుంటూ దందా చేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంచక్కా దోపిడీ చేస్తున్నారు.

నిబంధనలు తొక్కి.. ఇసుక మెక్కి...

- బ్రిడ్జి కిందే యథేచ్ఛగా ఇసుక తరలింపు
- తహశీల్దారుకు ఫిర్యాదు



అద్దవారిపల్లి, గుండ్లూరు సమీపంలో బ్రిడ్జి వద్ద ట్రాక్టర్లతో ఇసుక రవాణా

కలికిరి: చెక్‌డ్యామ్‌లు, ఓవర్ బ్రిడ్జిలకు కనీసం ఐదు వందల మీటర్ల దూరం వరకు నదిలో ఇసుక ఎత్తకూడదని నిబంధనలు చెబుతున్నాయి. కొంతమంది ఇసుకాసురులు ఆ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఇదిగో ఇలా పట్టపగలే బ్రిడ్జి కిందే ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు.

- మండలంలోని అద్దవారిపల్లి వద్ద బాహుదా నదిలో ఓవర్ బ్రిడ్జి కిందనే ఇసుక తవ్వేస్తుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుండ్లూరు, అద్దవారిపల్లి గ్రామాల పరిధిలోని బాహుదానదిపై నిర్మించిన వంతెన కింద నిత్యం ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండటంతో వంతెన ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బ్రిడ్జి వద్ద ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక విద్యార్థి యూనియన్ నేత నరేష్ గురువారం తహశీల్దారు మహేశ్వరీబాయికి ఫిర్యాదు చేశారు. నది చుట్టు పక్కల రైతులు నది భూగర్భజలాలపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారని, ఇటువంటి చర్యలతో భూగర్భజలాలు అడుగంటి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన తహశీల్దారు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మిట్స్ ప్రొఫెసర్ నాగ శ్వేతకు డాక్టరేట్



కురబలకోట: అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గుత్తి నాగ శ్వేతకు పీహెచ్‌డీ లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ గురువారం తెలిపారు. కర్నాటక రాష్ట్రం బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి ఆమె పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు తెలిపారు. నాగశ్వేతను కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల అభినందించారు.

ఖర్చుల వివరాలు చెప్పండి

పీలేరు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో 2024 జూన్ 1 నుంచి ఇప్పటివరకు 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన వివరాలు తెలపాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా అన్నారు. గురువారం ఆయన పంచాయతీ కార్యకలాపాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరుతూ ఈవోకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటివరకు భవన నిర్మాణ అనుమతులు ఎన్ని మంజూరు చేశారు, ఎంత ఆదాయం వచ్చింది, సిబ్బందిని తొలగించడానికి గల కారణాలు తెలపాలని అందులో కోరారు. పంచాయతీ పరిధిలో ఆర్‌వో ప్లాంట్ల సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడానికి గల కారణాలు తెలపాలన్నారు. వార్డు మెంబర్లు నాగభూషణం, శ్రీనాథరెడ్డి, నాగరాజ, అబీద్, రామకృష్ణారెడ్డి, కాలేషా, మల్లికార్జునరెడ్డి, పిక్కా రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

కలికిరి: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బంది కృషి చేయాలని ట్రాన్స్‌కో పీలేరు డీఈఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం సూర్య ఘర్, ఉర్జవీర్ పథకాలపై వినియోగదారులకు తెలియచేయాలన్నారు. డీవైఈఈ ఎం.శివయ్య, ఏఈ ముజీబుర్ రెహ్మాన్, ఎల్‌ఐలు, లైన్‌మెన్‌లు, ఏఎల్‌ఎంలు పాల్గొన్నారు.

పనివేళల పెంపును ఉపసంహరించుకోవాలి

పెద్దమండ్యం: పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దమండ్యం ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ సమస్యలను సేకరిస్తూ, సభ్యత్వ నమోదులో వారు మాట్లాడారు. ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పు చేస్తూ సాయంత్రం 5 గంటల వరకు పొడగించాలన్న నిర్ణయాన్ని ఎస్టీయూ పక్షాన ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంతాలలో ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి, కన్వీనర్ సుబ్బారెడ్డి, నాయకులు సీ వీ రమణ, నరసింహులు, మధూకరరెడ్డి, హరీష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

కలికిరి: రబీ పంటల సాగులో మెలకువలపై మండలంలోని రైతులకు వ్యవసాయశాఖ, కేవీకే ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌కుమార్‌రెడ్డి, డీఆర్సీ ఏఓ గంగాధర్, కేవీకే శాస్త్రవేత్త పీరూసాహెబ్ మాట్లాడుతూ టమాటా, మిరప, వేరుశనగ పంటలు, కొబ్బరి చెట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. కొబ్బరి చెట్లలో సర్కిలాకార తెల్లదోమ ఆశించినప్పుడు నల్లటి మసిరంగు ఆకుకు వ్యాపించి పూత, పిందెలు రాలి చిన్నకాయలు వస్తాయన్నారు. టమాటాలో ఎర్రనల్లి ఆశించిడం వలన పంట నాణ్యత తగ్గుతోందన్నారు. నివారణకు సంబంధించి చేపట్టవలసిన చర్యలను రైతులకు వివరించామన్నారు.

జ్ఞానాంబికలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

మదనపల్లె: పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 115 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అల్సెక్ టెక్నాలజీస్ సంస్థ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తే 30మంది బిజినెస్ ప్రాసెస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అలాగే డీఎన్‌బీ టెక్నాలజీస్ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 85 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సురభిరమాదేవి, అధ్యాపకులు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ రమాదేవి, సిబ్బంది

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

బి.కొత్తకోట: బి.కొత్తకోటలో ఆక్రమణలు తొలగింపు గురువారం రెండో రోజు కొనసాగింది. స్థానిక ప్రధాన రహదారుల్లో వ్యాపారులు ఆక్రమించిన స్థలాలను జేసీబీలతో తొలగించారు. రంగసముద్రం రోడ్డు, బీరంగి రోడ్డు, మెయిన్ రోడ్డులో దుకాణాలు రోడ్డుపైకి వచ్చాయి. కొందరు కట్టడాలు, మరికొందరు గేట్లు వేసుకున్నారు. ఇవన్నీ మురికి కాలువను ఆక్రమించి నిర్మించుకోవడం జరిగింది. కాలువను గుర్తించిన నగర పంచాయతీ అధికారులు ఆ మేరకు ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. ప్రధాన రహదారిలో దుకాణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్నారు. ఆక్రమణ తొలగింపు సందర్భంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. మదనపల్లె, ములకలచెరువు వైపు వెళ్లే బస్సులు, వాహనాలు బైపాస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాయి. రెండో రోజు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని కమిషనర్ పల్లవి, సీఐ రాజారెడ్డి, ఎస్‌ఐ నరసింహుడు, మేనేజర్ రమాదేవి పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బంది కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు.



రోడ్డుపై శిథిలాలు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

తంబళ్లపల్లె: ఐటీడీఏ జాతీయ స్థాయి ఆటల పోటీలకు తంబళ్లపల్లె గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో 20,21 తేదీల్లో జరిగిన ఐటీడీఏ రాష్ట్ర స్థాయి పోటీలలో వాలీబాల్ విభాగంలో నిరంజన్‌నాయక్, సాయినాయక్, ఈశ్వర్‌కుమార్‌నాయక్ ప్రతిభ కనబరిచారన్నారు. నిరంజన్ నాయక్ జావలింగ్‌త్రోలో 39 మీటర్ల పోటీలో ప్రతిభచాటి మొదటి స్థానం నిలిచినట్లు తెలిపారు. ఈనెల 24,25తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఐటీడీఏ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపల్ షబానా, టీచర్లు అభినందించారు.

హౌసింగ్ లేఅవుట్ల పరిశీలన

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి నియోజకవర్గంలో పక్కా గృహాలు మంజూరైనా లే అవుట్లలో మౌళిక వసతులు లేనందున నిర్మాణ పనులు ఊపందుకోలేదు. ఈ విషయంపై గురువారం సాక్షి పత్రికలో గృహ నిర్మాణం నత్త నడక, హౌసింగ్ లే అవుట్లలో సౌకర్యాల కొరత అని వెలువడిన వార్తపై అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రషీద్ ఖాన్, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, జేఈ బాలచంద్రాచారి పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, బి.కొత్తకోట మండలాల్లోని పలు గ్రామాల్లోని హౌసింగ్ లే అవుట్లను సందర్శించి మౌళిక వసతులపై ఆరా తీశారు. అనంతరం పలు గ్రామాల్లో పంచాయతీ నిధులతో పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టాలని సర్పంచ్‌లకు కార్యదర్శులను ఆదేశించారు.అనంతరం వారు అంగన్‌వాడీల్లో చేపడుతున్న మరుగుదొడ్లు, పైప్‌లైన్ పనులను తనిఖీ చేసారు.



మరుగుదొడ్డి నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న ఈఈ, డీఈ, జేఈ

ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి

పీలేరు రూరల్: పోస్టల్ ఖాతాలకు ఖాతాదారులు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి. వినోద్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక తపాలా కార్యాలయంలో పది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు సబ్ డివిజన్ పరిధిలో 25,802 నిరుపయోగ ఐపీపీబీ ఖాతాలు ఉన్నాయని, వీటన్నింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు బదిలీ / ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని కోరారు.ఈ నెల 30వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ వై. మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.



కౌంటరును పరిశీలిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి. వినోద్‌కుమార్

రబీ పంటకు ఉచిత బీమా లేదు

కలకడ: రబీ పంటకు ఉచిత బీమా వర్తించదని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బాలయ్యగారిపల్లె, పోతువారిపల్లె పంచాయతీలలో పర్యటించి రబీ సీజన్ 2024–25 సంవత్సరానికి టమాట పంట బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. డిసెంబర్–15వతేది వరకూ నాటే టమాట పంటలకు వాతావరణ పరిస్థితుల మార్పు వల్ల పంటనష్టం జరిగితే ఇఫ్కోటిక్కో జనరల్ బీమాకు ఎకరానికి రూ.1600 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. టమాట పంటపై రుణం తీసుకున్న రైతులు బీమాకోసం బ్యాంకులకు అంగీకారపత్రం ఇచ్చినట్లు అయితే బ్యాంక్ బీమా నగదు చెల్లించే అవకాశం ఉందన్నారు. ఆత్మ బీటీఎం అమృత్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది రమణమ్మ, చందన, తదితరులు పాల్గొన్నారు.



టమాట పంట బీమా గురించి తెలియజేస్తున్న ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, తదితరులు

శాస్త్రవేత్తలుగా ఎదిగేలా కృషి చేయాలి

రాజంపేట టౌన్ : విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించగలరని డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థులు సోషల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన వర్కింగ్ మోడల్స్‌ను డిప్యూటీ డీఈఓ సందర్శించి మాట్లాడారు. చాలా మంది విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలన్న లక్ష్యంతోనే ఉంటారని, అయితే శాస్త్రవేత్తలు కావాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శాస్త్రవేత్తలు అయ్యేందుకు ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన అన్ని వర్కింగ్ మోడల్స్ సమాజానికి ఉపయోగపడేలా ఉన్నాయని, విద్యార్థుల ఆలోచన సృజనాత్మకంగా ఉందని కొనియాడారు. న్యాయనిర్ణేతలుగా నరేష్, శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 సుబ్బరాయుడు, హెచ్‌ఎం కె.జయలక్ష్మి, సోషల్ ఉపాధ్యాయులు సి.ఆదిలక్ష్మి, అచ్యుత, లక్ష్మమ్మ, వీరప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థుల వర్కింగ్ మోడల్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ శివప్రకాష్‌రెడ్డి

ఆకేపాడు పాఠశాల తనిఖీ

మండలంలోని ఆకేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేశారు. డిప్యూటీ డీఈఓ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. టెస్ట్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించారు.

ప్రమాణాలు పాటించి ప్రమాదాలు నివారిద్దాం

రాయచోటి (జగదాంబసెంటర్) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు – 1,2 గుర్రప్ప, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతా పంకజ్, ఐక్యూఏసీ అధిపతి కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంలో సమాజం బాధ్యత వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను పాటించాలన్నారు. అనంతరం రాయచోటి మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ విభాగం ప్రతినిధులు సుబ్బరాయుడు, అజయ్‌కుమార్‌లు ట్రాఫిక్ నియమాలను వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ సుబ్బరాయుడు

‘లయన్స్’ సేవలను ఆదర్శంగా తీసుకోండి

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డీఈఓ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డిలు పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన పలురకాల పోటీల విజేతలకు గురువారం డైట్ సభా భవనంలో బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛంద సేవాసంస్థలు చేపడుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి తాము సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, అధ్యాపకులు శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, నాగరాజు, అసదుల్లా, రెడ్డెయ్య, రాయచోటి గ్రంథాలయాధికారి జయభరత్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి, జోన్ చైర్మన్ మహమ్మద్, డిస్ట్రిక్ట్ చైర్మన్ హరీష్‌చంద్ర పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్ అనుమతులు రద్దు చేయాలి

మదనపల్లె: పట్టణ ట్రాఫిక్ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని, బాహుదా కాలువకు ఆనుకుని, బెంగళూరు బస్టాండ్‌లో ఐదేళ్ల క్రితం మూసివేసిన పెట్రోల్‌బంక్ అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు వై.ఉత్తన్న డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టరేట్‌లో డీఏఓ పద్మావతిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తన్న మాట్లాడుతూ...పట్టణంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య జఠిలంగా తయారైందన్నారు. అందులో భాగంగానే ఇటీవల రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవడం, వందేళ్ల నాటి వృక్షాలను కొట్టివేయడం జరిగిందన్నారు. ప్రజల సౌకర్యం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు తమవంతు కృషి చేస్తుంటే, పట్టణ నడిబొడ్డున ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని మూసివేసిన పెట్రోల్‌బంక్‌ను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సురేష్, వరప్రసాద్, నాగేంద్ర, మహేష్, ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.